

నేడు తిరుపతి జిల్లాలో ఫైనాన్స్ కమిషన్ పర్యటన

తిరుపతి బ్యూరో : రెండు రోజుల పర్యటన నిమిత్తం జిల్లాకు విచ్చేయనున్న16వ ఫైనాన్స్ కమిషన్ గురు, శుక్రవారాల్లో తిరుపతి జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అరవింద్ పనగారియా, 15 మందిసభ్యులతో కలిసి 17వ తేదీ ఉదయం విజయవాడ నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని 11.30 గంటలకు తాజ్ హోటల్‌కు చేరుకుంటారు. అనంతరం కలెక్టరేట్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుని గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతారు. అనంతరం తిరుమల చేరుకుని 18వ తేదీ ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ జెసి శుభం బన్సల్ తో కలిసి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో..

పేదలే సమిధలు

2024లో కుటుంబం ఆత్మహత్యాయత్నం తాజాగా చిత్తూరులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కొడుకు 'ఆన్‌లైన్' బెట్టింగ్‌లతో లక్షల్లో అప్పులపాలైన ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గంలో 2024, అక్టోబర్ 5న సంచలనం కలిగించింది. డబ్బు విషయమై కుటుంబంలోని నలుగురు గొడవపడి, పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తండ్రి నాగరాజురెడ్డి (61), తల్లి జయంతి (54), కొడుకు దినేష్ (23), కుమార్తె సునీత బలవన్మరణం చెందారు. కుటుంబం కుటుంబమే లేకుండా పోయింది. కొడుకు దినేష్ బిటెక్ చదువుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వ్యసనంగా మార్చుకున్నాడు. తండ్రికి ఆస్తి పంపకాల్లో వచ్చిన రూ.20 లక్షలనూ బెట్టింగ్‌లో పెట్టాడు. డబ్బుల విషయమై గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతిచెందారు. ఆన్‌లైన్ బెట్టింగుల్లో రూ.20 లక్షలు అప్పుల పాలయ్యారని సిఐ లక్ష్మీనారాయణ అప్పట్లో కేసు నమోదు చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో 20 లక్షలు పోగొట్టుకుని 2024, అక్టోబర్ 5న కుటుంబం మొత్తం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీడీనెల్లూరు మండలంలో చోటు చేసుకుంది. నలుగురు మృతిచెందారు.

చిత్తూరులో భార్య నగలు తాకట్టు పెట్టి మరీ...

చిత్తూరు జిల్లా ఎస్‌పి వివన్ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌పై పోలీసు శాఖ నిఘా పెంచింది. క్రికెట్, క్రీడలు, లాటరీలు, కార్డ్‌గేమ్స్ పేరిట నడుస్తున్న ఈ బెట్టింగ్ యాప్స్ కోట్లాది రూపాయల అక్రమ లావాదేవీలకు మార్గం అవుతున్నాయి. మంగళవారం చిత్తూరు పట్టణంలోని సంతపేట ప్రాంతంలో 7.30 గంటలకు చిత్తూరు పట్టణానికి చెందిన నలుగురు యువకులు క్రికెట్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్‌పి ఆదేశాల మేరకు టుటౌన్ పట్టణ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య, సిబ్బంది కలిసి నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 48వేల రూపాయల నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎ1 ఎం.రాజాను విచారించగా 'దఫాబెట్ స్పోర్ట్స్' అనే ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా భారీగా డబ్బులు నష్టపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. కొన్ని రోజుల క్రితం ఈ యాప్‌లో ఖాతా ఓపెన్ చేసి చిన్న మొత్తాల్లో బెట్టింగ్ పెట్టేవాడు. కొన్ని సందర్భాల్లో చిన్న చిన్న లాభాలు వచ్చాయి. ఆ లాభాలను చూసి ఇంకా ఎక్కువ డబ్బు పెట్టాలనే ఆశతో భార్య బంగారు ఆభరణాలను బ్యాంకులో తాకట్టు పెట్టి బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా, స్నేహితుల వద్ద నుంచి కూడా లక్షల రూపాయల వరకు అప్పు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి నష్టాలపాలయ్యాడు. వారం రోజుల్లోనే దాదాపు ఐదు నుంచి ఆరు లక్షల రూపాయల వరకు నష్టపోయారు. సంతపేటలోని ఎం.రాజా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇ.దస్తగిరి చికెన్‌షాపు నిర్వహిస్తున్నాడు. కె.సర్ఫుద్దీన్, ఇసామిల్ ఓబనపల్లి కాలనీ వాసులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరంతా పేదలే కావడం గమనార్హం.

బెట్టింగ్ యాప్‌లు.. మాయాజాలం : ఎస్‌పి మణికంఠ

బెట్టింగ్ యాప్‌లు లాభాలు చూపించే మాయాజాలం మాత్రమే. ఈ బెట్టింగ్ ఆటల వలన ఆత్మహత్యలు, కుటుంబ విభేదాలు, నేరప్రవృత్తి పెరుగుతున్నాయి. 2024, అక్టోబర్ నెలలో చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు మండలానికి చెందిన దినేష్ అనే యువకుడు బెట్టింగ్‌కు బానిసయ్యాడు. పెద్దమొత్తంలో అప్పుచేసి కుటుంబ ఆస్తిని తాకట్టు పెట్టాడు. చివరకు ఆర్థిక ఒత్తిడికి లోనయిన తండ్రి, తల్లి, అక్కతో కలిసి పురుగుల మందు తాగి మృతిచెందారు. ఎవరైనా బెట్టింగ్ చేయాలంటూ డబ్బులు అడిగితే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు లేదా 112, చిత్తూరు పోలీసు వాట్సాప్ నంబర్ 9440900005 కు సమాచారం ఇవ్వండి.

తాగునీరు, విద్య, వైద్యానికి పెద్దపీట

శాసనసభ అంచనాల కమిటీ సమీక్ష

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

జడ్‌పి నిధులతో తాగునీరు, విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సి, పిహెచ్‌సిలకు కేటాయించే నిధులు పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శాసనసభ అంచనాల కమిటి సమీక్షా సమావేశం నిర్వహించింది. ఛైర్మన్ జోగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎంఎల్‌ఎలు భూమా అఖిల ప్రియ, నిమ్మక జయకష్ణ, మద్దిపాటి వెంకట రాజు, పార్థసారధి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, ఏలూరి సాంబ శివ రావ్, ఎమ్మెల్సీ లు వరాహ వెంకట సూర్యనారాయణ రాజు, వరుదు కళ్యాణితో పాటు చిత్తూరు శాసన సభ్యులు గురజాల

జగన్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభ అంచనాల కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ అంచనాల కమిటీ చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సమావేశంలో భాగంగా సూచించిన అంశాలు అన్నింటిని అధికారులు తప్పక పాటించాలన్నారు. అంచనాల కమిటీ సమీక్షకు శాఖల వారీగా నివేదించే నివేదికలను పూర్తి సమాచారంతో కమిటీకి సమర్పించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులు కింద కేటాయించే నిధుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా ఎక్కువగా మామిడి, టమోట, పూల సాగు ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు నిధులను పెంచాలన్నారు. పోక్సో కేసులకు సంబంధించి బాధితులకు అందించే నష్టపరిహారాన్ని ఎక్కువ మొత్తంలో ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. మిషన్ వాత్సల్య కింద అందిస్తున్న నగదు మొత్తాన్ని పెంచాలన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్, బాలిక విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

రూ.కోటి 12 లక్షల విలువైన 510 మొబైల్ ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి పోలీసు మొబైల్ హంట్ అప్లికేషన్ సేవలు సత్ఫలితాలనిస్తున్నాయి. మూడు నెలల వ్యవధిలోనే మొబైల్ హంట్, సిఇఐఆర్ పోర్టల్ ద్వారా దాదాపు కోటి 12 లక్షల 20వేల రూపాయల విలువ గల 510 మొబైల్ ఫోన్లు రికవరీ చేశారు. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మొబైల్‌లో చాలా సున్నితమైన సమాచారం ఉంటుందని, అందరూ మొబైల్ వాలెట్ పాస్వర్డ్‌తో పాటు ముఖ్యమైన సమాచారాన్ని ఎవరు పడితే వాళ్లు సెల్‌ఫోన్ పాస్వర్డ్ ఓపెన్ చేయకుండా చూసుకునే విధంగా పాస్‌వర్డ్ స్ట్రాంగ్‌గా పెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే అప్లికేషన్, లేదా పోర్టల్‌లో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకూ 12 విడతల్లో 4,275 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. వీటి విలువ రూ.7 కోట్ల 56 లక్షల 40వేలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో తిరుపతి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్‌క్రైం సిఐ ఆర్.వినోద్‌కుమార్, సాదిక్‌అలీ, రమణారెడ్డి పాల్గొన్నారు.

'మొబైల్ హంట్' లో పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ

సబ్‌రిజిస్ట్రార్ గుమస్తా అవినీతిపై బొజ్జల సుధీర్ రియాక్షన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ రైతు తనకున్న పొలాన్ని మార్ట్‌గేజ్ చేసి రద్దు కొరకు గుమస్తాకు రూ.3,600 లంచం ఇచ్చాడు. అయితే లంచం ఇచ్చి ఇరవై రోజులైనా మార్ట్‌గేజ్ రద్దు చేయకపోగా, మరింత లంచం కావాలని డిమాండ్ చేయడంతో ఆగ్రహించిన రైతు నేరుగా ఎంఎల్‌ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డికి ఫోన్ చేసి తెలిపాడు. బాధితుడు ఫోన్ చేసిన 15 నిమిషాల వ్యవధిలోనే ఎంఎల్‌ఎ స్పందించి కార్యాలయానికి చేరుకుని సబ్‌రిజిస్ట్రార్‌ను నిలదీసి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చరవాణిలో ఫిర్యాదు చేశాడు. తన ప్రభుత్వ పాలనలో అవినీతి అక్రమాలకు, లంచగొండికి స్థానం లేదంటూ ఎంఎల్‌ఎ స్పష్టం చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణంలో సంచలనంగా మారింది. బాధిత రైతు ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపేదల ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి రూరల్ మండలం పరిధిలోని నిరుపేదలు నిర్మించుకునే ఇళ్లకు విద్యుత్తు మీటర్లు ఇవ్వాలని, స్థానిక ఎమ్మెల్యే నాని మాటలు విని ఆలస్యం చేస్తే ఆందోళనలకు సిద్ధమవుతామని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డిలు పేర్కొన్నారు. ఎ.పి.ఎస్.పి.డి.సి.ఎల్ సీఎండీ సంతోషరావును తుమ్మలగుంట సర్పంచ్ సుబ్బరామిరెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ బుజమ్మ, గాంధీపురం సర్పంచ్ లక్ష్మీ, మన్నూరు శివలతో కలసి వినతి పత్రం అందించారు. ప్రధానంగా గాంధీపురం, అవిలాల, సాయినగర్, లింగేశ్వరనగర్, తుమ్మలగుంట, పేరూరు, వేదాంతపురం, మల్లంగుంట గ్రామ పంచాయతీల్లో చాలా మంది పేదలు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకుని విద్యుత్తు మీటర్ల కోసం ఎదురుచూస్తున్నా సంబంధిత విద్యుత్తు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. లక్షలు ఖర్చు చేసి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసినా విద్యుత్తు సరఫరా లేకుండా అష్టకష్టాలు పడుతున్నారని, వారందరికీ తక్షణం విద్యుత్తు మీటర్లు మంజూరు చేయాలని కోరారు. చీకట్లో తెలియకుండా విష సర్పాలు కాటుకు గురవుతున్నారన్నారు. ఈ మేరకు స్పందించిన సీఎండీ సంతోషరావు తప్పకుండా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారందరికీ విద్యుత్తు మీటర్లు అందించి సరఫరా అందజేస్తామని హామీ ఇచ్చారు.

రాజకీయ అంశంగా..టిటిడి 'గోశాల'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం గోశాల వివాదం రాజకీయ అంశంగా మలిచేశారు.. వంద గోవులు పైగా మృతిచెందాయని టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తొలుత ఆరోపిస్తే, ఆ మృతులన్నీ వైసిపి హయాంలో జరిగినవేనని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తున్నాయి. దాదాపు నాలుగు రోజులుగా రాజకీయ అంశంగా గోశాల చుట్టూనే రాజకీయాలు జరుగుతున్నాయి. సిపిఎం, సిపిఐ మాత్రం భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించరాదని, టిటిడి విజిలెన్స్ విచారణ జరిపి నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తిరుపతి గోశాలను సందర్శించారు. గోశాల నిర్వహణ తీరు బాగానే ఉందని, అయితే దాణా కుంభకోణం నిగ్గు తేల్చాలని డిమాండ్ చేయడం గమనార్హం. భూమన కరుణాకర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేశారని, మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అలిపిరి పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఇవన్నీ ఇలా ఉంటే డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శుక్రవారం తిరుపతికి

రేపు పవన్ తిరుపతికి రాక

విచ్చేసి గోశాలను సందర్శించి తిరుమలలో బస చేసి, శనివారం శ్రీవారిని దర్శించుకుని వెళ్లనున్నారు. ఇటీవల తన కుమారుడు సింగపూర్ లో అగ్నిప్రమాదం నుంచి బయట పడటంతో మొక్కులు తీర్చుకోవాలని అనుకుంటున్నారు. ఇప్పటికే పవన్ సతీమణి అన్నా లెజ్ నోవా తిరుమలలో మొక్కులు తీర్చుకున్నారు. పవన్ కు అనారోగ్యంగా ఉండటంతో ముందుగా ఆమె వెళ్లారు. పవన్ కేబినెట్ సమావేశానికీ అనారోగ్య కారణంతోనే వచ్చి వెళ్లిపోయారు. అయితే శుక్రవారం పవన్‌కల్యాణ్ తిరుపతి గోశాలను సందర్శించి, ఏం వ్యాఖ్యలు చేస్తారో వేచి చూడాల్సిందే.



బుధవారం టిటిడి గోశాలను పరిశీలించిన సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

అధికారులను అడ్డుకున్న 'పెద్దిరెడ్డి' అనుచరులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి రాయల్ నగర్ ప్రాంతం బుగ్గమఠం స్థలాన్ని వారం రోజుల్లో ఖాళీ చేయాలని నిర్వాహకులు ఈనెల 11న నోటీసులు జారీ చేశారు. అయితే పెద్దిరెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం ఉదయం పెద్దిరెడ్డి ఇంటివద్దకు చేరుకున్న అధికారులు ఆక్రమించుకున్న స్థలంలో కొలతలు వేసే ప్రయత్నం చేశారు. అయితే పెద్దిరెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. బుగ్గమఠం స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మించి, గేటు నిర్మాణం చేపట్టారని స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయంలో హైకోర్టులోనూ పెద్దిరెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది.

తిరుపతిలో హీరో ప్రదీప్, దీపిక హల్చల్

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్ర విజయోత్సవంలో భాగంగా ప్రముఖ హీరో ప్రదీప్ మాచిరాజు, హీరోయిన్ దీపిక తిరుపతిలో హల్చల్ చేశారు. తిరుపతిలో ఆ చిత్రం ప్రదర్శించబడుతున్న వెల్ రామ్ థియేటర్కు అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి చిత్రం యూనిట్ మధ్యాహ్నం సినిమా ప్రదర్శన సమయంలో చేరుకున్నారు. హీరో ప్రదీప్ మాచిరాజు మీడియాతో మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత కుటుంబ సమేతంగా నవ్వుకుంటూ చూడగలిగే సినిమా తీశామన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు నితిన్, భరత్ పాల్గొన్నారు.

యానాదుల ఇళ్లను తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి - సత్యవేడు

మండలంలోని పేరడం గ్రామంలో యానాదులు నివాసమున్న ఇళ్లను తగలబెట్టిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి మెలుగు రమేష్ డిమాండ్ చేశారు. పేరడం గ్రామంలోని యానాదులకు ఇంటి స్థలాలులేక ప్రభుత్వ భూమిలో 36 కుటుంబాలు మూడేళ్లుగా నివసిస్తున్నాయని, ఆ స్థలంపై కన్నేసిన భూస్వాములు ఇళ్లు వేయనీకుండా బెదిరిస్తూ భయాందోళనకు గురిచేస్తుండేవారన్నారు. మేకల రామయ్య, మేకల రాణి కుటుంబాల వారు తమిళనాడు రాష్ట్రం పెరియపాలెం సమీపంలోని గ్రామాలకు కూలి పనులకు వెళ్లగా మంగళవారం రాత్రి రెండు ఇళ్లను నిప్పుపెట్టి ఇంతటి దారుణానికి ఒడిగట్టారన్నారు. మొదటినుంచి గ్రామంలోని భూస్వాములు పేదలకు ఇళ్లివ్వనీకుండా ఆటంకాలు కల్పించారని గుర్తు చేశారు. విచారణ చేపట్టి, నిందితులను అరెస్టు చేయాలని, యానాదులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాలిపోయిన ఇళ్లను పరిశీలించిన వారిలో కెవిపిఎస్ సత్యవేడు మండల అధ్యక్షులు, మాజీ సర్పంచి కృష్ణయ్య, మహేష్, కొల్లాపూర్ వెంకటేష్, సుబ్రమణ్యం, లక్ష్మి, సావిత్రి, శాంతి ఉన్నారు.

డ్రైనేజీ కాలువ పనులు త్వరగా పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కొర్లగుంట బైపాస్ రోడ్డులో ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం 33 వ వార్డులోని స్కావెంజర్స్ కాలనీ, కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువల నిర్మాణం, రోడ్ల గుంతల పూడిక పనులను కార్పొరేటర్ దూది కుమారి, హెల్త్, ఇంజినీరింగ్, అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

'పరిశ్రమల' కాలుష్య 'భూతం'

- తాగునీరు, పంట పొలాలు కలుషితం
- భరించలేని దుర్వాసనతో మనుగడ

ప్రజాశక్తి -ఏర్పేడు

పరిశ్రమలు మానవ జీవనోపాధికి, అభివృద్ధికి దోహదపడాలే కానీ ముప్పుగా మారకూడదని విశ్లేషకులు చెబుతుంటారు. అయితే ఏర్పేడు మండలం పాగాలి పంచాయతీ పరిధిలోని రాక్‌మెన్, ఒస్విన్ వుడ్ పానెల్స్, విష్ణు బేరియం పరిశ్రమల వల్ల పరిసర ప్రాంతాలు కాలుష్య భూతంలో చిక్కుకుని పశువులకు, మనుష్యుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న పరిశ్రమాధిపతులు, కాలుష్య నివారణా చర్యలు చేపట్టడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. దీన్ని నివారించాల్సిన కాలుష్య నివారణ శాఖ 'లంచాల ముసుగులో' నిద్దరోతుందన్న విమర్శలూ లేకపోలేదు.

పాగాలి పంచాయతీలోని రాక్‌మెన్, ఒస్విన్‌వుడ్ పానెల్స్, విష్ణు బేరియమ్ పరిశ్రమల వల్ల నీరు, వాయు కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు తెలియజేసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాక్‌మెన్ పరిశ్రమ వ్యర్థాలను పక్కనే ఉన్న పాగాలి ఏటికాల్వలో కలిపేస్తున్నారు. దీనివల్ల పాగాలి, కుమ్మరిమిట్ట గ్రామాల ప్రజానీకానికి తాగు, సాగునీరు సమస్యగా మారింది. అదేవిధంగా ఒస్విన్ వుడ్ ప్యానెల్స్ కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థపు నీరు కుమ్మరిమిట్ట చెరువు, పక్కనే ఉన్న ఏటికాల్వలో కలిపేస్తున్నారు. కుమ్మరిమిట్ట గ్రామంలో 50 కుటుంబాలకు తాగునీటికి ఒకే ఒక్క బోరు ఉంది. ప్రస్తుతం పరిశ్రమల వ్యర్థాల వల్ల కలుషిత నీరు రావడంతో తాగేందుకు జనం జంకుతున్నారు.

'బేరియమ్' పరిశ్రమతో ఘాటైన కంపు

బేరియమ్ తయారీ కర్మాగారం చుట్టుపక్కల గ్రామాల్లో సాయంత్రం అయితే చల్లని గాలిని ఆస్వాదించాల్సిన సమయంలో ఒక్కసారిగా ఘాటైన కంపుతో తట్టుకోలేక వాంతులు చేసుకునే పరిస్థితి. అన్నం కూడా సహించదని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రులైతే కంటిమీద కునుకు కరువే. పిల్లలు, వృద్ధులు వాసన భరించలేక అనారోగ్యం పాలవుతున్నారు. కుమ్మరిమిట్టలో వ్యర్థపు నీరు ఏటికాల్వ, చెరువుల్లోకి వదలడం వల్ల బోరు నీళు తాగాలంటే భయమేస్తుందని ఆయా గ్రామస్తులు వాపోయారు. బోరు నీరు రంగు, రుచి మారి తాగలేని పరిస్థితి. స్నానం చేసిన తరువాత దురదలు వస్తున్నాయి. బోరు మరమ్మతుకు గురైనర పంట పొలాల్లోకి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిందే. మూగజీవాలకు సైతం ఈ నీరే దిక్కు. ఒక్కోసారి వాటికొచ్చే ఆరోగ్య సమస్యలు అంతు చిక్కకుండా ఉంటున్నాయి. ఏటిలోకి మురికి నీరు చేరడం వల్ల పొలం సారవంతం తగ్గి దిగుబడి సైతం క్రమేపీ తగ్గిపోతోంది.

పరిశ్రమల వ్యర్థాలను యథేచ్ఛగా చెరువుల్లోకి కలిపేస్తున్న పరిశ్రమాధిపతులు



గిరిజన భూముల్లో... భూస్వాములు 'పాగా'..!

వందల ఎకరాలు అన్యాక్రాంతం స్పందించని రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

గిరిజన భూములపై భూస్వాముల కన్ను పడింది. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 2వేల ఎకరాల్లో భూస్వాములు ఎంచక్కా కబ్జా చేసి పాగా వేశారు. ఉన్న ఎకరా అరెకరా పొలాన్ని భూస్వాములు ఆక్రమించుకోవడంతో భూస్వాములు సముద్రతీరంలోని చేపల వేటకు, అటవీ ఉత్పత్తులను అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి అండగా నిలవాల్సిన రెవెన్యూ యంత్రాంగం పెత్తందారుల కొమ్ముగాస్తోంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో రిజర్వు ఎంఎల్‌ఎ ఉన్నప్పటికీ వారికి న్యాయం జరిగిన పాపాన పోలేదు.

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రం మండలం తనియాలి పంచాయతీ పరిధిలో తనియాలి ఎస్టీలు 200 కుటుంబాలు ఉన్నాయి. 42 మందికి 1976లో సిజిఎఫ్ఎస్ సొసైటీ కింద వంద ఎకరాలను ఇచ్చారు. సర్వే నంబర్ 1/1-309, 24.1/2లలో పట్టాలను వీరికి ఇవ్వాల్సి ఉంది. అదే మండలంలోని మినుములమూడి పంచాయతీలో వంద గిరిజన కుటుంబాలు ఉన్నాయి. ఒక్కొక్కరికి ఎకరం చొప్పున ప్రభుత్వం ఇచ్చింది. వీరికి పట్టాలను ఇవ్వలేదు. చందనమూడి సర్పంచి వంద ఎకరాలను కబ్జా చేశారు. ఈ అక్రమణలపైన గిరిజనులు ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ కుంభా రవిబాబును 2022లో కలిసారు. ఇప్పటికీ న్యాయం జరగలేదు.

కల్లూరు పంచాయతీ ఎస్‌టి కాలనీలో 40 కుటుంబాలు ఉన్నాయి. సర్వే నంబర్ 1 కింద 36 ఎకరాలు ఉన్నాయి. ఇవన్నీ గిరిజన భూములే. అదే గ్రామంలో 1976లో ఎస్‌టిల కోసం 500 ఎకరాలు కేటాయించారు. ఎస్‌టిలకు కేటాయిస్తే, అప్పటినుంచి అనుభవిస్తున్నది భూస్వాములే. భూస్వాములు బోర్లు, బావులు వేసుకుని శనగ, కాకర, బెండ వంటి కూరగాయలు పండించుకుని లాభాలార్జిస్తున్నారు. అదే గ్రామం పక్కన పురాతన శివాలయం పక్కన నాలుగు కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయి. తమ పంట పొలాల్లో ఇల్లు కట్టుకుంటారా? అంటూ 40 గుడిసెలకు అగ్గిపెట్టి కాల్చేశారు. ఇప్పటికీ దొరవారిసత్రం పోలీసు స్టేషన్‌లోనే ఈ కేసు 'నడుస్తూ' ఉంది. అదే నియోజకవర్గంలో చిట్టమూరు మండలం చిల్లకూరు పంచాయతీ పరిధిలో ఎస్‌టిలు 45 మందికి రెండు ఎకరాల చొప్పున 90 ఎకరాలను ఇవ్వాలని ఆర్డీవో పదేళ్ల క్రితం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికీ వీరికి భూములు దక్కలేదు. 'స్వామి కనికరించినా, పూజారి వరం ఇవ్వని చందంగా' తహశీల్దార్ వీరికి భూములు ఇచ్చేందుకు వివక్ష చూపిస్తున్నారు. సర్వే నంబర్ 1050లో 500 ఎకరాలు గిరిజన భూములున్నాయి. గత 40 సంవత్సరాలుగా పండ్లుఫలం పొందుతున్నారు. గత 15ఏళ్లుగా ఫారెస్టు అధికారులు ఇది అటవీ భూములని వారిపై దౌర్జన్యానికి పాల్పడుతూ బెదిరింపులకు గురిచేస్తుండటం గమనార్హం.



గిరిజనుల సమస్యలు అధికారుల దృష్టికి (ఫైల్‌ఫొటో)

గిరిజన భూములు వారికే చెందాలి

కొండ్రెడ్డి హరినాథ్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



గిరిజనుల భూములు గిరిజనులకే ఇవ్వాలి. మౌలిక వసతులు కల్పించి పొలాలను అనుభవంలోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కనీసం కూటమి ప్రభుత్వమైనా భూస్వాముల పాగాలో ఉన్న భూములను గిరిజనులకే దక్కేలా చూడాలి. ఒక్క భూ సమస్యే కాదు,గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే దారి కూడా సమస్యేనన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

-మస్తాన్ మొహిద్దీన్

మాట్లాడుతున్న మస్తాన్ మొహిద్దీన్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండి మస్తాన్ మొహిద్దీన్ అన్నారు. గూడూరు పట్టణంలోని వైసిపి మైనార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ముస్లిం సమాజానికి తీరని నష్టమని తెలిపారు. ముస్లిం భూములను, వక్ఫ్ ఆస్తులను కాజేసే కుట్ర అని, ఇలాంటి చట్టాన్ని ముస్లింలపై ప్రయోగించడం మంచిది కాదన్నారు. ముస్లిం మైనారిటీ సమాజానికి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అండగా ఉన్నారని మరో సారి నిరూపించారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో షేక్ రఫీ,షేక్ కాలేషా, అబ్దుల్లా, రఫీ,షేక్ షుకూర్ పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారం అందుకుంటున్న పసల అజీ బాబురావు

ఉపాధ్యాయుడికి ప్రతిభ పురస్కారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు బోధించే సహిత విద్య ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న పసల అజీ బాబురావు అంబేద్కర్ జాతీయ ప్రతిభ పురస్కారం గుంటూరు లోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో మాజీ ఎమ్మెల్సీ నాగయ్య చేతుల మీదుగా అందుకున్నారు. ఈ పురస్కారం వచ్చిందుకు గూడూరు ఎంఈవో కాంచన , ఎంఆర్‌సి స్టాఫ్ , మండల ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనాలకు పార్కింగ్ వసతి కల్పించండి

కార్మికుల వాహనాలకు పార్కింగ్ సవతి కల్పించాలని కోరుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఫాక్స్ లింక్ కంపెనీలో కార్మికుల వాహనాలకు పార్కింగ్ వసతి లేదని, వెంటనే పార్కింగ్ వసతి స్థలం కేటాయించాలని సిఐటియు ఆధ్వర్యంలో యాజమాన్యాన్ని బుధవారం కోరారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికులు తమ విలువైన వాహనాలను రోడ్డు పైనే ఉంచుతున్నారన్నారు. కార్మికులు యాజమాన్యాన్ని సంప్రదిస్తే పార్కింగ్ లేదని వాహనాలను రోడ్లపైనే వుంచాలని ఆదేశం చడంతో కార్మికులు మరో మార్గం లేక రోడ్డుపైనే ఉంచుతున్నామని తెలిపారు. ఏర్పేడు మండల సిఐటియు నాయకులు కరీముల్లా కార్మికులకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని కోరారు. లేకుంటే ఏపీఐఐసికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పోటా పోటీగా క్యారమ్స్ పోటీలు

క్యారమ్స్ ఆటలో నిమగ్నమైన దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి లోని తిలక్ నగర్‌లోని కాస్మోపాలిటిన్ క్లబ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించే ఉమ్మడి నెల్లూరు జిల్లా క్యారమ్స్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పలు జట్ల మధ్య హోరాహోరీ పోటీ సాగుతోంది. ఈ పోటీలకు 40 టీమ్‌లు హాజరయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రసన్న మాట్లాడుతూ క్యారమ్స్ పోటీలకు క్రీడాకారులు విరివిగా హాజరయ్యారన్నారు. క్యారమ్స్‌ను అభివృద్ధి చేసే దిశగా రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, రవీంద్రా రెడ్డి, వెంకట్రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి- రేణిగుంట: గిరిజన సంఘం మండల నాయకులను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేణిగుంట గంగమ్మ గుడి వద్ద గిరిజన సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దినారి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంఘం రేణిగుంట మండల కమిటీని తొమ్మిది మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఉట్ల ధరణి, ఉపాధ్యక్షులుగా రోడ్డ మునస్వామి, ప్రధాన కార్యదర్శిగా కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా మేంద్రగుత్తి చీరాలయ్య, కమిటీ సభ్యులుగా గురుమూర్తి, రాముడు, గుణశేఖర్, విజయమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దినారి ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మన గిరిజన తెగను ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అభివృద్ధి చేయకుండా, గిరిజన ఉద్యోగులకు, ఖాళీ అయిన ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగులైన గిరిజన బిడ్డలకు ద్రోహం చేస్తోందన్నారు. భావితరాల బిడ్డల కోసం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం పోరాటాలు నడపాలని 'దిశా-నిర్దేశం' చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు రోడ్డ మునిస్వామి, రత్నబాబు, ఈశ్వరయ్య, ఆనంద్ బాబు, సుధాకర్, సులోచన, భాస్కర్, ప్రభాజ్యోతి, గాయత్రి, గీత, చెన్నకేశవులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమికి అన్ని మతాలూ సమానమే: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి అన్ని మతాలూ సమానమే నని, కానీ హిందువుల మత కీర్తిని దెబ్బతీసే కుట్రకు మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెరతీశారని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో 2021 నవంబరులో 75 నుంచి 80 ఆవులు మృత్యువాత పడ్డాయని దీనిపై ఆయన ఎందుకు స్పందించలేద న్నారు. 2021 నుండి 2024 వరకు గోశాలలో కుళ్లిన ధాన్యాన్ని గోవులకు అందిస్తున్నారని, గోవులకు వాడే మందులు కూడా కాలం చెల్లినవిగా విజిలెన్స్ రిపోర్టు చెబుతుందన్నారు. అప్పట్లో ఆయన ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. గత టిటిడి తప్పిదాలపై సాక్ష్యధారాలతో కూడా వస్తామని వైసిపి నాయకులు సమాధానాలు చెప్పేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. యాదవ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ గోశాలలో అవకతవకలపై ఇప్పటికే సమగ్ర విచారణ చేయాలని టిటిడి ఛైర్మన్‌కు వినతి ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, అలిమినేని మధు, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా చక్ర స్నానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు కోనేటిమిట్ట శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో వసంతోత్సవం, ముసుగుల సేవ, తిరుమంజనం, వంటి పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహిం చారు. అనంతరం స్వామికి చక్రస్నానం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమణ చేసి ఇల్లు నిర్మించుకున్న వాటిలో అభ్యంతరం లేని వాటిని క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 30ను తీసుకొచ్చిందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. రెగ్యులరైజేషన్ స్కీం 2025 పై కలెక్టరేట్ లో విలేకరుల సమావేశాన్ని కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఈ స్కీము ద్వారా ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో ఇల్లు కట్టుకున్న వారు ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు క్రమబద్ధీకరిస్తామన్నారు. 150 చదరపు గజాల లోపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేసుకొని ఉంటే ఆ ఇళ్లకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి పట్టా మంజూరు చేస్తామని తెలిపారు. 2019 అక్టోబర్ 15 తేదీ చివరి తేదీగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్లో నిర్దేశిత స్థలాలు, లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్టు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ సాధ్యం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ కింద ఇంటి పట్టా మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 151 నుండి 300 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని, నివాసం ఏర్పరచుకొని ఉంటే బిపియల్ వారు 15 శాతం బేసిక్ విలువ 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు, అదే ఎపియల్ వారు అయితే 15 శాతం బేసిక్ వాల్యూ, యథావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు, 301 నుండి 450 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని, నివాసం ఏర్పరచుకొని ఉంటే బిపియల్ వారు 100 శాతం బేసిక్ విలువ 50 శాతం బేసిక్ విలువ యథావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు, 451 చదరపు గజాల పైన ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని, నివాసం ఏర్పరచుకొని ఉంటే బిపియల్, ఏపీఎల్ అని తేడా లేకుండా వారు బేసిక్ విలువపై 5 రెట్లు చెల్లిస్తూ యథావిధిగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తామని తెలిపారు. డిసెంబర్ 31 2025 లోపు గ్రామ వార్డు సచివాలయాలలో, తహశీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటే క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం నివేదికలను జిల్లా అధికారులకు పంపి సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారన్నారు. ఆపైన ఆదేశాలు వచ్చిన అనంతరం తహశీల్దార్ కన్వేయన్స్ డీడల రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేస్తారన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రెండేళ్ల తర్వాత లబ్ధిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కు కల్పిస్తారన్నారు. లబ్ధిదారు ఆ ప్రాంతంలో నివసిస్తున్నట్లుగా ఆధారాలు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్, ఆస్తి పన్ను రసీదు, విద్యుత్ బిల్లు, నీటి పన్ను రసీదు ఇతర ఆధారాలను కలిగి ఉండాలన్నారు. క్రమబద్ధీకరణకు ఎంపికైన వారు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములను రెండు వాయిదాల పద్ధతిలో చిందించేలా వెసులుబాటును కల్పించామన్నారు. ఈ వాయిదాలను సిఎఫ్ఎంఎస్ లో చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొన్నారు.

శ్మశానాల అభివృద్ధికి చేయూత: ఎమ్మెల్యే

శ్మశాన వాటిక ప్రహరీ గోడ, దహన వాటికలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: శ్మశానాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూత అందిస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనంలో శ్మశాన ప్రహరీ గోడ, దహన వాటికను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం శ్మశాన వాటికకు ప్రహరీ గోడ, దహన వాటికలను రిబ్బన్ కట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశానాలు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల నాయకులు తన గ్రామాల్లోని శ్మశానాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే సూచించారు తన దృష్టికి తీసుకువస్తే నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఆర్‌డి ఏకాంబరం, గోవిందస్వామి, రవి అధికారులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన శిక్ష: ఎస్ఐ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తే చట్టరీత్యా జరిమానా, జైలు శిక్ష విధిస్తామని ఎస్ఐ విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. బుచ్చినాయుడు కండ్రిగ చెక్‌పోస్టు ఆవరణలో నిషేధిత బెట్టింగ్ యాప్స్ నిర్వహణపై పలువురు యువకులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ త్వరలో ఐపీఎల్ టోర్నమెంట్ ప్రారంభం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో టోర్నమెంట్ క్రీడాభిమానులతో పాటు బెట్టింగ్ రాయుళ్ల విజృంభించే అవకాశాలు ఉన్నాయని బెట్టింగ్ యాప్స్ బారిన పడి మోసపోయి సొమ్ము పోగొట్టుకోకుండా జాగ్రత్త పడాలని హెచ్చరించారు. ఆన్‌లైను బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసే సోషల్ మీడియా ప్రభావం చూపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఐటీ యాక్ట్, 2000 చట్టం కింద ఆన్‌లైను బెట్టింగ్, అక్రమ జూదం నిర్వహించే వెబ్‌సైట్లు నడిపే వారికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశాలు ఉంటాయన్నారు. ఆన్‌లైనులో పాల్గొన్న వారికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు 50 వేల రూపాయల జరిమానా ఉంటుందన్నారు. జాగ్రత్తగా వుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలువురు యువకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి..

మంత్రులకు వినతి

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం: చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రపురం మండల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రులను కమ్మ కండ్రిగ గ్రామానికి చెందిన కొడవకంటి భక్తవత్సలం నాయుడు కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణరెడ్డి కె భక్తవత్సలం నాయుడు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించాడు. మండలంలోని అనుపల్లె, కమ్మ కండ్రిగ గ్రామాలకు బసు సర్వీసులను కొనసాగించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన కట్ట వద్ద ఉన్న జలకంఠేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, 108 అడుగుల ఆంజనేయ విగ్రహం ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరానని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని మంత్రి లోకేష్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. మంత్రులు సానుకూలంగా స్పందించి చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శ్రీ సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు వివేకానంద రోడ్డులో శ్రీ రామ మందిరంలో పట్టణ ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలు స్వీక రించారు. అనంతరం భారీ అన్న దానం నిర్వహించారు. ఉభయ దాతలుగా ముఠా యూనియన్ వర్కర్స్ నాయకులు గారా బాబూరావు, సరస్వతి, ధనుంజయ రావు, రమ్యకృష్ణ దంపతులు వ్యవహరించారు.

సిఐటియు ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి: ఎంపిపి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని గ్రామ పంచాయతీలలోని ఇంటి యజమానులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి, పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగ గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో మౌలిక వసతుల కల్పిన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణలపై దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఇళ్ల నుండి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు. చేసి ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామస్తులు గ్రామాభివృద్ధి కోసం ఇంటి పన్నులను చెల్లించాలని కోరారు. గ్రామసభలో పలు సమస్యలను ఏకరువు పెట్టారు. శ్మశానంలోని చెత్త తొలగించాలని, ఇంటి పన్ను నగదు ఎక్కువగా వసూలు చేస్తున్నారని, తగ్గించాలని, డ్రైనేజీలు నిర్మించాలని, గ్రామస్తులు విన్నమించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

కెరీర్ సంసిద్ధత ఎంతో అవసరం

మాట్లాడుతున్న డాక్టరు బి చంద్రమౌళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థులు విజయవంతంగా తమ జీవితాన్ని మలుచు కోవాలంటే అవసరమైన సామర్థ్యాలను పొందడానికి కెరీర్ సంసిద్ధత ఎంతో అవసరమని డాక్టర్ బి చంద్రమౌళి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో కెరీర్ సంసిద్ధత' అంశంపై బుధవారం వర్క్ షాప్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి, ఉద్యోగాలలో విజయం సాధించాలంటే కెరీర్ సంసిద్ధత ద్వారా సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ ఫౌండేషన్ మేనేజర్ శ్రుతి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ రెడీనెస్(సంసిద్ధత)ను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల నుంచి బయటకు వచ్చే కొత్త గ్రాడ్యుయేట్లకు కెరీర్ సంసిద్ధత కోసం అవసరమైన సామర్థ్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రకాష్, డాక్టర్ శాంసన్ రాజు, డాక్టర్ పి వెంకటేష్, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ వసంత్, డాక్టర్ పి హరిబాబు, డాక్టర్ కందేరి శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే భావిభారత మేధావులు

-డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్

సాధించిన సర్టిఫికెట్లు, పతకాలతో విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేటి విద్యార్థులే భావి భారత మేధావులుగా (ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లుగా) అభివృద్ధి చెందుతారని డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ అన్నారు. గూడూరు శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సత్యం ఒలింపియాడ్ - ఐఐటీ పరీక్షలో రాష్ట్ర స్థాయి లో పాఠశాల స్థాయిలో 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, పతకాలు బుధవారం ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వడం, విద్యార్థులను ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. అనంతరం కడివేటి చంద్రశేఖర్ మట్లాడుతూ విద్యార్థులలోని అంతర్గత ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా శ్రీ గాయత్రి స్కూలు యాజమాన్యం సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు సుప్రజ, శిరీష, ధనశ్రీ, రాఘవయ్య, రఫీ , విద్యార్థులు పాల్గొన్నారు.

మునిరాజా సేవలు అభినందనీయం: డివైఇఓ

మునిరాజా దంపతులను సన్మానిస్తున్న విద్యాధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులందరికీ సేవలందించి గుర్తింపు తెచ్చు కున్న మర్రి మునిరాజా సేవలు అభినందనీ యమని పుత్తూ రు డివిజన్ డివైఇవో ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక, జిల్లా పరిషత్ గేట్ పుత్తూరు (తమిళ) పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేసిన మర్రి ముని రాజా ముప్పై ఆరేళ్ల గురువుగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి ఉప విద్యాశాఖ అధికారి కే బాలాజీ, పుత్తూరు ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివైఇవో ప్రభాకర్ రాజు మాట్లాడుతూ మర్రి మునిరాజా విద్యారంగానికి అందించిన సేవలను గుర్తిస్తూ అభినందిం చారు. తిరుపతి ఉప విద్యాశాఖ అధికారి కే బాలాజీ మాట్లాడుతూ సన్మాన గ్రహీత సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎంఆర్ కృష్ణవేణి, ఉపాధ్యాయ సంఘాల వైపు నుండి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, ఏపీయుఎస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఎస్‌టియు ఉపాధ్యాయ మిత్రులు మునిరాములు, ఉపాధ్యాయులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్తకు ఘన నివాళి

వీరేశలింగం పంతులుకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -ఏర్పేడు: రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పాతవీరాపురంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల వీడియో సందేశంలో మాట్లాడుతూ ఆనాటి సమాజంలో దురాచారాలను రూపుమాపడానికి నడుంకట్టి, స్త్రీ విద్యను ప్రోత్సహించి,బాలికల కోసం ఎన్నో పాఠశాలను నిర్మించి, సాహితీ వేత్తగా, సంఘసంస్కర్తగా, ఆధునిక కవిత్వానికి ఆద్యునిగా, నాటక రంగానికి పితామహుడుగా , నవయుగ వైతాళికుడిగా, పత్రికా సంపాదకునిగా, నవలాకారునిగా, అనువాద రచయితగా అనేక భాషల్లో ప్రావీణ్యం పొంది, తన రచనల ద్వారా ,తన ఆదర్శాలు, ఆలోచనల ద్వారా నిరంతరం ప్రజల్లో జీవించే ఉన్న కందుకూరి అడుగుజాడల్లో నేటి విద్యార్థులు, యువత, నడవాల్సిందిగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, ఉపాధ్యాయులు డాక్టర్ దేవరాజులు, పద్మజ, శ్రీహరి పాల్గొన్నారు.

గంగ జాతర నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి- తిరుపతి: స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర నిర్వహణ, తీసుకోవలసిన తగు చర్యల పై తిరుపతి శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులుతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

గూడూరులో

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని అగ్ని మాపకాధికారి విజయ్ కుమార్ సూచించారు. గూడూరు రైల్వే స్టేషన్ రైల్వే సిబ్బందికి బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజరు వెంకటేశ్వర రావు, అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వంట ఇంట్లో గ్యాస్ లీక్ అయినప్పుడు వంట గదిలో డీజిల్, పెట్రోల్ అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదని పుత్తూరు అగ్నిమాపక అధికారి నేతాజీ పేర్కొన్నా రు. పుత్తూరులోని నగరి రోడ్డు శ్రీనగర్ కాలనీలో శ్రీహరి నివాస్ అపార్టుమెంట్ 40 కుటుంబాల మహిళలకు గ్యాస్ పొయ్యి ప్రమాదాలు, జాగ్రత్తలపై ఫైర్ అధికారి తమ సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లీడింగ్ ఫైర్ మ్యాన్ నాగేశ్వరరావు, ముని ప్రతాప్, విశ్వనాథం శెట్టి, శ్రీనివాసు, బాల నరసింహులు, ఫైర్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పుత్తూరులో

నాయుడుపేట: అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల బారిన పడకుండా వుండేందుకు తీసుకో వాల్సిన జాగ్రత్తలపై ఎస్ఎఫ్ఓ ఐసి రమణయ్య అవగాహ న కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్‌లోని బాలాజీ అపార్టుమెంట్, మేనకూరులోని అరబిందో ఫార్మసీ కంపెనీల అపార్టుమెంట్లలో మహిళలకు విద్యుత్ ప్రమాదాల గురించి, గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలోఎల్ఎఫ్ రామకృష్ణ, ఫైర్ మ్యాన్లు ఏ సందీప్, జె సుబ్రహ్మణ్యం, సిహెచ్ నాగరాజు, మురళి పాల్గొన్నారు.

నాయుడుపేటలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

క్రైం న్యూస్

450 కేజీల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

పట్టుబడిన బియ్యం అక్రమ తరలింపు వాహనం

ప్రజాశక్తి -ఏర్పేడు : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలి స్తున్న ఓ ఆటోను పోలీసులు బుధవారం పట్టుకు న్నారు. పాపానాయుడు పేట చుట్టు పక్కల గ్రామాల పేదల నుండి అతి తక్కువ ధరకు రేషన్‌ను కొనుగోలు చేసి ఏపీ 03 టి డి 1693 నంబర్ గల ఆటోలో అమండూరుకి చెందిన గొడుగు లక్ష్మీ, కండెల చెంగమ్మ కలిసి తరలిస్తుండగా మూల కండ్రిగ గ్రామ సమీపాన ఏర్పేడు పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. ఆటోలో ఉన్న ముగ్గురిని అరెస్టు చేసి ఆటోతో సహా 450 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏర్పేడు సీఐ జయచంద్ర ఆదేశం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని నిందితులను కోర్టుకు హాజరపరిచామని తెలిపారు.

శ్మశాన సమస్య పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం గోపాల కృష్ణాపురం గిరిజన గ్రామం లోని శ్మశాన సమస్యను పరిష్కరించాలని, భూము ల ఆక్రమణలు, అక్రమ తవ్వకాలు నివారిం చా లని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం గిరిజన గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాల కృష్ణాపురం గిరిజన గ్రామంలో నెలకొన్న శ్మశాన సమస్యను పరిష్కరించాలని, భూముల ఆక్రమణను అరికట్టాలని, అక్రమ తవ్వకాలను నివారించాలని కోరారు. ఈ గ్రామ సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్ , సిఐటియు నాయకులు మునిరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి రవి, సర్పంచి వేలాయుధం, గ్రామ పెద్ద రామచంద్రయ్య పాల్గొన్నారు.

కృష్ణమనాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాని

కృష్ణమనాయుడు సేవా తత్పరుడు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ఓ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూనే పేద విద్యార్థులకు విద్యను అందించిన గొప్ప సేవా తత్పరుడు ఉపాధ్యాయులు కృష్ణమనాయుడు అని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. బుధవారం మంగళం ఫ్రెండ్స్ పాఠశాల సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణమ నాయుడు ఉద్యోగ విరమణ పాఠశాల ఆవరణలో నిర్వ హించారు. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటుగా, ప్రజలు ఇబ్బందుల్లో వున్నా తన వ్యక్తిగత నగదును పెద్ద మొత్తంలో ప్రభుత్వానికి అందించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మంగళం ట్రెండ్స్ పాఠశాలతో తనకు మంచి అనుబంధం ఉందని, ఇక్కడ ఉపాధ్యాయులు ఎంతో నాణ్యతతో కూడిన విద్యా బోధన చేయడంతో పాటు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్స హిస్తున్నా రన్నారు. మంగళం ట్రెండ్స్ పాఠశాల అభివృద్ధికి తానెప్పుడు ముందుం టానన్నారు. ఈ సందర్భంగా కృష్ణమనాయుడు దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి విశిష్టంగా కృషిచేసిన కృష్ణమనాయుడు సేవలను ఉపాధ్యాయులు కొనియాడి ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు, కృష్ణమనాయుడు సోదరులు సుబ్రహ్మణ్యం నాయుడు, శ్రీనివాసులు నాయుడు, చిదంబరం నాయుడు, కుమార్తెలు లిఖిత, భవిత, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సప్తగిరి ప్రసాద్‌ను పరామర్శిస్తున్న టిడిపి నాయకుడు సి దివాకర్‌రెడ్డి

సప్తగిరి ప్రసాద్ తల్లి కర్మ క్రియల్లో డాలర్ గ్రూప్ అధినేత

ప్రజాశక్తి-తిరుపతి: తిరుపతి శ్రీనివాసపురంలో ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన యాక్టర్, కమెడియన్ సప్తగిరి ప్రసాద్ తల్లి చిట్టెమ్మ కర్మ క్రియలకు డాలర్స్ గ్రూప్ అధినేత, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి దివాకర్ రెడ్డి హాజరయ్యారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఆయనకు అభిమానులు, సప్తగిరి ప్రసాద్ కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన సప్తగిరి ప్రసాద్ తల్లి చిత్రపటం వద్ద ఘన నివాళు లర్పించారు.

BEFORE THE SMALL CAUSES COURT
5TH JUDGE AT CHENNAI
M.C.O.P.NO. 3933 OF 2023

1. VEDLA KUMARACHARI, S/o.Vedla Venkatramana achari, Block No.2-g-4, Indhiramma colony, Daminedu, Chittoor, District, Andhra Pradesh. ...Petitioner

Vs

1.S.MOHAN REDDY, S/o.S.Narasimha Reddy,
2.THE MANAGER, IFFCO-TOKIO General Insurance Co., Ltd., ...Respondents

To,
S.MOHAN REDDY, S/o.S.Narasimha Reddy, 5-97/4, M.G.Brother Layout, Vedanthapuram, Thirupathi, Andhra Pradesh -517507
... 1st Respondent

Sir,
The above MCOP was filed by the Petitioner against you before the 5th Judge Small Causes Court at Chennai. Please take notice that the above MCOP case was posted on 21.04.2025 for your appearance and appear on that day at 10.30 AM either in person or through your counsel, failing which the matter will be called in your absence and decided on merits.

R.VETRIVEL, B.A., B.L.,
COUNSEL FOR PETITIONER

IN THE COURT OF THE ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNERI
M.C.O.P.No.174/2022

Bellamkonda Guruvaiah ....Petitioner
Vs
1. Undela Murali Krishna Reddy,
2. United India Insurance Company Limited.,
...Respondents

That,
Undela Murali Krishna Reddy, Son of Undela Obul Reddy, Venkateswarapuram, Nellore Urban, 28-9-1461, Ganesh Street, SPS Nellore, Nellore District, Andhra Pradesh 524005. ...For 1st Respondent

NOTICE
Please take that you are the First Respondent owner of the vehicle involved accident. Your appearance of this above said court on 29.04.2025 at 10.30 Am without fail otherwise exparte on the same date.

Yours
A. DEVENDRAN, B.Sc., BL
Counsel for Petitioner.